క్లుప్తంగా

ప్రజలకు వైద్య సేవలు



ప్రజలకు వైద్య పరీక్షలు అందిస్తున్న వైద్య సిబ్బంది

సింహాద్రిపురం : మండల పరిధిలోని దేవతాపురం గ్రామంలో ఇంటింటికి వైద్య సేవలలో భాగంగా శనివారం బిదినంచర్ల పీహెచ్‌సీ డాక్టర్ ఖాజామొహిద్దీన్ గర్భిణులు, బాలింతలకు, ఇంటికే పరిమితమైన రోగులకు వైద్య సేవలు అందించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దిల్షాద్, డీఈఓ సౌభాగ్య, ఏఎన్‌ఎం సుభాషిణి, హెల్త్ అసిస్టెంట్ అంకయ్య, ఆశా కార్యకర్త శోభ తదితరులు పాల్గొన్నారు.

13న విద్యుత్ లోక్ అదాలత్

జమ్మలమడుగు : విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఈనెల 13న మంగళవారం లోక్ అదాలత్‌ను విద్యుత్‌సబ్‌స్టేషన్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీ శేషగిరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి జిల్లా స్థాయి అధికారులు హాజరు అవుతున్నట్లు తెలిపారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు సమస్యలుంటే వచ్చి చెప్పుకోవచ్చునన్నారు.

పాఠశాలకు చేరిన జగనన్న విద్యా కానుక

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చేరాయి. మండలంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు కలిపి 51 ఉన్నాయి. ఈ పాఠశాలలో సుమారు 4500 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని మండల విద్యాధికారి సుబ్బరావు తెలిపారు. పాఠశాలలు తెరిచేసరికి విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయాలని ప్రధానోపాధ్యాయులకు తెలిపారు.

అంధులకు అన్నదానం

పులివెందుల రూరల్ : పట్టణంలోని శ్రీ వీరనారాయణస్వామి అంధుల ఆశ్రమంలో శనివారం పులివెందుల మండలం ఎర్రిపల్లె గ్రామానికి చెందిన బండి ఓబుళరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు బండి చంద్రబాబురెడ్డి ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, సేవా సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాలిటెక్నిక్ విద్యార్థులకు అవగాహన

సింహాద్రిపురం : పాలిటెక్నిక్‌లో చేరే విద్యార్థులకు ఈనెల 12వ తేదీ నుంచి 24వ తేదీవరకు అవగాహన కల్పిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. సింహాద్రిపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ చేరే విద్యార్థులకు చదివే కోర్సు ప్రాముఖ్యత, వివిధ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు, వివిధ విషయాలపై నిపుణులచే అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేముల : మండల పరిధిలోని మబ్బుచింతలపల్లె, పెర్నపాడు, పెద్దజూటూరు, వేముల గ్రామాల్లోని 33/11 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ జేఈ కె.రమేష్ తెలిపారు. శనివారం ఆయన తెలుపుతూ ఆయా గ్రామాల్లో విద్యుత్ కోతలు ఉంటాయని.. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రాజగోపాల్

ప్రొద్దుటూరు కల్చరల్ : షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా చల్లా రాజగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం సాయంత్రం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో కడప జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా చల్లా రాజగోపాల్, కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి శౌరికుమార్, ఉపాధ్యక్షులుగా మమత, ఇమ్మానుయేల్, సంయుక్త కార్యదర్శిగా దేవేంద్ర, సభ్యుడిగా సురేష్‌కుమార్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. షూటింగ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురాముడు, గంగిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జేష్టమాసం నాల్గవ శనివారం సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు జగనన్న కానుకలు సిద్ధం

- నేటినుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- 52వేల మంది విద్యార్థులకు జగనన్న కానుకలు సిద్ధం



పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ

జమ్మలమడుగు : ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఈ ఏడాది 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. దీంతో తమ పాఠశాలల్లో ఎలాగైనా ఈ ఫలితాలను చూపి విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రచారం జోరు పెంచారు. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి విద్యార్థులకు వస్తున్న పథకాలతోపాటు, వత్తిడిలేని చదువులు, ఐఐటీలో మొదటి ప్రాధాన్యత వంటి ప్రత్యేకతలను చూపుతూ వాట్స్‌యాప్, ఫేస్ బుక్‌లతోపాటు కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేనివిధంగా 580పైగా మార్కులను ఐదువందలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో చాలా మంది విద్యార్థులు సాధించారు. ముఖ్యంగా మైలవరం గురుకుల పాఠశాల, దొమ్మరనంద్యాలలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, పట్టణంలోని పతంగే రామన్నరావు పాఠశాల, బాలికల హైస్కూల్‌తోపాటు మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. అదేవిధంగా మిట్టయిగిరి వీధిలో ఉన్న ఉర్దూ పాఠశాలలో వందశాతం, మైలవరం గురుకుల పాఠశాలలో వందశాతం ఫలితాలు వచ్చాయి. ఉపాధ్యాయులు సైతం తమ శ్రమకు తగ్గట్టుగా విద్యార్థులు మంచి ఫలితాలను సాధించిపెట్టారని ఈ అవకాశాన్ని ఎలాగైన సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయి. ప్రత్యేకాకర్షణగా ప్రభుత్వం ప్రభుత్వపాఠశాలల్లో అందిస్తున్న వసతులు, ఉపయోగాలను వివరిస్తూ కరపత్రాలను తయారు చేయించారు.

పుస్తకాలు సిద్ధం...

2023–24 విద్యాసంవత్సరానికి ఇప్పటికే ప్రభుత్వం నుంచి పుస్తకాలు మండల కేంద్రాలకు అందాయి. మండల విద్యాశాఖాధికారుల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల పంపిణీ ఇప్పటికే ప్రారంభమైంది. ఈనెల 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభం అవుతుండటంతో అదేరోజు విద్యార్థులందరికి జగనన్న విద్యాకానుకలు సైతం ఇవ్వడం కోసం అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 292 పాఠశాలలు ఉండగా అందులో 22,996 మంది విద్యార్థులకు పుస్తకాలతోపాటు, జగనన్న విద్యాకానుకను అందించబోతున్నారు.

మండలం	పాఠశాలలు	విద్యార్థులు
జమ్మలమడుగు	62	5703
మైలవరం	49	4438
పెద్దముడియం	38	2105
కొండాపురం	48	3500
ముద్దనూరు	44	2800
ఎర్రగుంట్ల	51	4450
మొత్తం	292	22996

పాఠశాలలు ప్రారంభం రోజునే జగనన్న విద్యాకానుక...

ఈనెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అవుతుండటంతో ఆదేరోజు ప్రభుత్వం నుంచి విద్యార్థుల కోసం వచ్చిన జగనన్న విద్యాకిట్లు పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ ఏడాది అన్ని తరగతులకు పుస్తకాలు వచ్చాయి. 9వ తరగతి పుస్తకాలు మారడం ద్వారా ఇంకా కొన్ని పుస్తకాలు రావలసి ఉంది. ఇప్పటికే మండలంలోని అన్ని పాఠశాలలకు పుస్తకాలు, జగనన్న కిట్లు పంపిణీ చేశాము.

– క్రిష్టఫర్, ఎంఈఓ, జమ్మలమడుగు.

విచారణ పూర్తయ్యాకే ఏపీజీఈఏ లెటర్స్‌ను పరిశీలించాలి

కడప రూరల్: జరగబోవు సాధారణ బదిలీలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ పూర్తయ్యాకే ×ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ)₹ లెటర్స్‌ను పరిగణలోకి తీసుకోవాలని ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆదాల వెంగల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మేసా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ బదిలీలకు సంబంధించి గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల నుంచి ఆఫీస్ బేరర్స్‌కు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు.

అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఏపీజీఈఏ వారు ఆఫీస్ బేరర్స్‌గా అసోసియేషన్‌లో పనిచేయకపోయినా లేదా సభ్యత్వం లేకపోయినా కూడా ఆఫీస్ బేరర్స్ అని లెటర్స్ ఇచ్చారని పేర్కొన్నారు. ఎంఆర్‌ఓ, డాక్టర్, గజిటెడ్ ఆఫీసర్స్ హోదాలో ఉన్న వారికి కూడా బదిలీల్లో మినహాయింపు కోరుతూ లెటర్స్ ఇచ్చారని తెలిపారు. ఈ అంశాలకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఆ అసోసియేషన్‌పై పలు ఫిర్యాదులు వెళ్లాయని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రభుత్వ అధికారి సురేష్‌కుమార్ విచారణ చేపట్టారని తెలిపారు. ఇందుకు సంబంధించి విచారణ పూర్తయినంత వరకు ఏపీజీఈఏ లెటర్స్‌ను హోల్డ్‌లో ఉంచాలని కోరారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



నూతనంగా నిర్మించిన ఆలయం

కమలాపురం : మండల పరిధిలోని కొండాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ లక్ష్మణ హనుమత్సమేత నూతన దేవస్థాన విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలను ఈనెల 12వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు తెలిపారు. 12వ తేదీ నుంచి 14వ తేదీవరకు ప్రముఖ వేద పండితులు తదితర పూజలు నిర్వహించనున్నారు. 14న విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట అనంతరం సీతారామ కల్యాణం నిర్వహించనున్నారు. ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

14న బండలాగుడు పోటీలు : ఆలయ ప్రతిష్టా మహోత్సవాలను పురస్కరించుకుని 14వ తేదీన సీనియర్ విభాగం ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి రూ.1 లక్ష నగదు బహుమతి ఇవ్వనున్నారు. అలాగే రూ.80వేలు, రూ.60వేలు, రూ.40వేలు, రూ.20వేలు, రూ.10వేలు వరుసగా నగదు బహుమతులు దాతల సహకారంతో ఇస్తున్నామని, భక్తులు పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్, తదితరులు

సింహాద్రిపురం : గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ హెచ్చరించారు. శనివారం సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాలైన కసనూరు, దిద్దేకుంట్ల గ్రామాలను ఆయన విజిట్ చేసి ఇరు వర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి తగాదాలకు ఆస్కారం ఉండకూడదని.. ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకొస్తే కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రోషన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాట ప్రకారం పరిహారం అందించాము

– ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి



గాయపడిన మహిళ సమస్య వింటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : స్టీల్‌ప్లాంట్‌కు భూములు కోల్పోయిన పట్టాదారు రైతులతోపాటు, అసైన్డు కమిటీలో పేర్లు ఉన్న రైతులకు సగ భాగం పరిహారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో ఇప్పించడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక రైతులకు ఇచ్చిన మాట ప్రకారం తాము పరిహారం ఇప్పించామన్నారు. గతంలో కొంత మందికి మాత్రమే పథకాలు వచ్చేవన్నారు. ఇప్పుడు అర్హులైన ప్రతి ఒక్కరికీ వలంటీర్ల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి పార్టీలకతీతంగా పథకాలను అమలు చేస్తున్నామన్నారు. త్వరలో స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన పనులు జరుగుతున్నాయని ఈ ప్రాంత వాసులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. గత పాలన కంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మీకు మేలు జరిగిందని అనిపిస్తే తమను ఆదరించాలంటూ ప్రజలను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అశ్విని, ఎంపీటీసీ శశికళ, ఓబుళరెడ్డి మునిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేసా

– ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

పులివెందుల టౌన్ : తనపట్ల ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో సంపూర్ణ మద్దతు అందించి శాసన మండలి సభ్యుడిగా ఎన్నుకున్న ప్రతి ఉపాధ్యాయుడికి రుణపడి ఉంటానని.. వారి సమస్యల పరిష్కారం కోసం శాయశక్తులా కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌టీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని నగరిగుట్ట ప్రాథమిక పాఠశాలలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు హాజరై ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డితోపాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు కేక్‌ను కట్ చేసి ఉపాధ్యాయులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాల జనబాంధవుడు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి అని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయడంలోనూ, 12వ వేతన సవరణ సంఘం ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న డీఏ, ఇతర బకాయిలను దశల వారీగా మంజూరు చేసేందుకు అంగీకారం, కొత్తగా ఏర్పాటు అయిన జిల్లా కేంద్రాలకు హెచ్‌ఆర్‌ఏ పెంపు తదితర సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానని పేర్కొన్నారు. జగనన్న సుపరిపాలన స్ఫూర్తిగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.కె.వెంకటనాథరెడ్డి, వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ వెంకటరెడ్డి, కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఏపీ గురుకుల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నజీరుల్లా, పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, పీఆర్టీయూ నాయకులు మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ విద్య, ఉన్నత ఉపాధి అవకాశాల ప్రాముఖ్యతపై ఈనెల 12 నుంచి 24 వరకు ఉచిత అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల కె.సురేంద్రనాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవగాహన తరగతుల్లో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు.

బ్రౌన్ కేంద్రానికి 1100 పుస్తకాలు

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ కేంద్రానికి బయటి ప్రాంతాల నుంచి పుస్తకాలు చేరుతూనే ఉన్నాయి. శనివారం 1100 పుస్తకాలను బ్రౌన్ కేంద్రం సిబ్బంది సేకరించారు. హైదరాబాదులోని దూరదర్శన్ విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు 500 పుస్తకాలు, ప్రముఖ సాహితీవేత్త, నటుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ 200, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.పద్మనాభరెడ్డి 200 పుస్తకాలు, విశ్రాంత తెలుగు రీడర్ డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ 200 పుస్తకాలు వెరిసి మొత్తం 1100 పుస్తకాలను బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథ పాలకులు జి.హరిభూషణరావు, సహాయకులు నీలకంఠేశ్వర్‌లకు అందజేశారు.

నేడు చిత్ర కవితా సౌరభం పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : కడప నగరం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అలంకారం వెంకట రమణరాజు రచించిన చిత్ర కవితా సౌరభం పుస్తకావిష్కరణ సభ చిత్ర సాహితీ ప్రచురణలు ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కార్యక్రమ నిర్వాహకులు అలంకారం విజయ్‌కుమార్, ఆదిత్యకుమార్‌లు ఈ మేరకు వివరాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా హైదరాబాదుకు చెందిన చింతా రామకృష్ణారావు, ఏలూరుకు చెందిన కందుల నాగేంద్ర వరప్రసాద్ పాల్గొంటారన్నారు. ప్రత్యేక అతిథిగా బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి వ్యవహరిస్తారని, యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం అధ్యాపకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పుస్తకాన్ని సమీక్షిస్తారని, అవధాని, నాటక రచయిత ఎంవీఎల్ఎన్ ప్రసాద్, సాహితీవేత్త జీవీ సాయిప్రసాద్‌లు కూడా పాల్గొంటారని తెలిపారు.

అధిక ఫీజులు వసూలు చేయడం తగదు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అధిక ఫీజు లు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ విభాగ కన్వీనర్ కోడూరు మల్లికార్జున డిమాండ్ చేశా రు. ఈ విషయమై శనివారం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఫీజుల రూపంలోనే కాకుండా యూని ఫాం పేరుతో విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించాలని కోరారు.

కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసింది

వైఎస్ కుటుంబమే

పులివెందుల టౌన్ : కరువు ప్రాంతమైన రాయలసీమను సస్యశ్యామలం చేసింది వైఎస్ కుటుంబమేనని అధికారమే లక్ష్యంగా మిషన్ రాయలసీమ అంటూ అభూత కల్పనలు సృష్టించడం టీడీపీకే చెల్లిందని.. లోకేష్‌బాబు మిషన్ రాయలసీమ ప్రకటనపై నాల్గవ వార్డు కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్ పేర్కొన్నారు. శనివారం పులివెందులలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు రాయలసీమ ప్రజలు సీమ రౌడీలు, కడప, పులివెందుల గూండాలు అని పిలిచి ఎన్నికల కోసం మిషన్ రాయలసీమ అంటూ సన్నాయి నొక్కులు నొక్కడం టీడీపీకే చెల్లిందని, లోకేష్‌బాబు లాంటి సన్నాసులు, చవటలు ఇంకో పది పాదయాత్రలు చేసినా సీమ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన ధ్వజమెత్తారు. మళ్లీ కాపీ, పేస్ట్ హామీలతో మినీ మ్యానిఫెస్టోతో జనాన్ని మరోమారు మోసం చేయడానికి సన్నద్ధమవుతున్నారన్నారు. పులివెందులలో నీకు, నీ పార్టీ బొచ్చగాళ్లకు గెలిచే సత్తా ఉంటే ఎందుకు నీ పాదయాత్రను రద్దు చేసుకున్నావన్నారు. పులివెందుల ప్రాంత అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో పుట్టకోనమ్మ అమ్మవారు

వేముల : మండల పరిధిలోని వి.కొత్తపల్లె గ్రామంలో వెలసిన శ్రీపుట్టకోనమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆలయం నిర్మించి ఏడేళ్లు పూర్తి కావడంతో గ్రామస్తులు ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. చెక్కభజన కార్యక్రమం భక్తులను అలరించింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డిలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

వేంపల్లె : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ కార్మిక సంఘ మండలాధ్యక్షుడు బి.రామాంజనేయులు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 20వ తేదీన ఛలో విజయవాడ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డుకు నిధులు ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్ వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం అందుకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు.

కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి బాలాజి, వర్కింగ్ అధ్యక్షుడు దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు, కార్పెంటర్ అంజి బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వల్ల చాలా నష్టపోయా

– వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డిసుబ్బారెడ్డి

చెన్నూరు : తను తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు పార్టీ కోసం అన్నివిధాల కష్ట పడటమే కాకుండా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నానని వైఎస్సార్ సీపీ చెన్నూరు టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఆయన తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వారు శుక్రవారం తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్పందిస్తూ నేను అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు చెన్నూరు మండల నాయకులు ఇందిరెడ్డి శివారెడ్డి, కల్లూరు విజయభాస్కర్‌రెడ్డిలు ఆర్థికంగా, రాజకీయంగా బలపడటం జరిగిందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ అప్పట్లో సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులే కరువైపోయారని తెలిపారు. నన్ను పోటీ చేయమన్నారు. అయితే నేను అనారోగ్య సమస్యలతో పోటీ చేయలేనన్నాను. అయితే పోటీ చేయటానికి ఎవ్వరూ లేకపోవడంతో ఓడిపోతానని తెలిసి కూడా పార్టీ కోసం పోటీ చేసి ఆర్థికంగా నష్టపోయానన్నారు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి నన్ను పిలిచి నాకు ఎన్నికల్లో సహకరించాలని కోరారు. ఆ ఎన్నికల్లో 15 రోజులు వైఎస్సార్‌సీపీ కోసం తిరిగానే తప్ప పార్టీకి ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టలేదన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి నాకు సొసైటీ అధ్యక్షులుగా పదవి ఇచ్చారన్నారు. అంతేకాకుండా జడ్పీటీసీ ఎన్నికలు రావడంతో ఓసీ మహిళకు కేటాయించడంతో మా అన్న కోడలికి సీటిచ్చారన్నారు. తెలుగుదేశం నాయకులు మాట్లాడే ముందు నిజా నిజాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. సమావేశంలో చదిపిరాళ్ల రామ సుబ్బారెడ్డి, పాత కుంట రమేష్ రెడ్డి, కిషోర్, ఎర్రసాని నిరంజన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు అహర్నిశలు శ్రమించాలి

బద్వేలు అర్బన్ : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు అహర్నిశలు శ్రమించాలని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ సూచించారు. రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ లక్ష్యాలతో కష్టపడి చదివి ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. గ్రూప్–1 మొదటి ర్యాంకర్ డాక్టర్ రాణిసుస్మిత (ట్రైనీ డిప్యూటీ కలెక్టర్–విశాఖపట్నం), గ్రూప్–2 రెండవ ర్యాంకర్ కె.శ్రీనివాసులు (ట్రైనీ డిప్యూటీ కలెక్టర్–బద్వేలు)లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి స్వయంకృషి, ఏకాగ్రత, పట్టుదల చాలా అవసరమని, అలాగే పోటీతత్వం, సమయ పాలన కూడా ముఖ్యమన్నారు. గ్రూప్–1 పదకొండవ ర్యాంకర్ రమణకాంత్ (ట్రైనీ డిప్యూటీ కలెక్టర్–కడప) మాట్లాడుతూ విద్యార్థి దశలో ఆరోగ్యకరమైన స్నేహ వాతావరణం పెంపొందించుకోవాలని సూచించారు. యోగివేమన విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు మాట్లాడుతూ సంపాదన ముఖ్యం కాదని, సద్గుణాలు ముఖ్యమని వివరించారు. అనంతరం డిగ్రీ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు.

నూతన అంగన్‌వాడీ భవనాలు ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

సింహాద్రిపురం : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–5, ఇందిరమ్మ కాలనీ, ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన నూతన భవనాలను శనివారం మార్కెట్ యార్డు చైర్మన్ వి.రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహాయ సహకారాలతో అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలను నిర్మించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామ్మోహన్, ఎంపీటీసీ జాఫర్, వార్డు మెంబర్లు సురేష్, మహబూబ్ షరీఫ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వసంతకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే



మాట్లాడుతున్న జడ్జి ఎం.ప్రదీప్ కుమార్

ఖాజీపేట : వృద్ధాప్యం వచ్చిన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే అని లేని యెడలా వారి శిక్షార్హులని కడప అడిషనల్ సివిల్ జడ్జ్ ఎం.ప్రదీప్ కుమార్ అన్నారు. ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లె పంచాయతీలోని పునీత్ లార్సెన్స్ వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వృద్ధులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం – 2007 ఏపీ తల్లిదండ్రులు వయోవృద్ధుల చట్టం – 2011 లోని నియమాలను వారికి వివరించారు. తల్లిదండ్రులను వదిలేసిన, వెళ్లిపోవాలని వేధించిన, వారిపై దాడులు చేసిన శిక్షార్హులని అన్నారు. మూడు నెలల జైలు శిక్ష లేదా అపరాధరుసుము, లేదా రెండూ కలిపి విధిస్తారన్నారు.

కడప జిల్లాలో మూడు ట్రిబ్యునల్స్ ఉన్నాయని తెలిపారు. కడప రెవెన్యూ డివిజనల్ కార్యాలయం, రాజంపేట, జమ్మలమడుగు అలాగే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. 14567 టోల్ ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయసేవాధికారి సంస్థ దృష్టికి తీసుకురావచ్చునని తెలియజేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు చెన్నయ్య, పారా లీగల్ వలంటీర్ అరుణకుమారి, వృద్ధాశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు.